క్లుప్తంగా

పంచాయతీ కార్మికుడి కుటుంబానికి సాయం



వెంకటేష్ కుటుంబానికి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: అన్నదేవరపేట పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న బొంతు వెంకటేష్ (60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి కార్మికులు, పంచాయతీ అధికారులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. వెంకటేష్ మట్టి ఖర్చుల నిమిత్తం పంచాయతీ కార్యదర్శి వీరన్న రూ.15 వేలు అందజేశారు. మండలంలోని పంచాయతీ కార్మికులు, వేగేశ్వరపురం, ప్రక్కిలంక పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, దుర్గాప్రసాద్‌ల ఆర్థిక సహాయంతో వెంకటేష్ కుటుంబానికి కూరగాయలు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముప్పిడి రవికుమార్, కార్యదర్శి కొండే వెంకటేశ్, కోశాధికారి గెడ్డం అరవాలరాజు, నాని, శ్రీను, నాగేశ్వరరావు గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సేవకులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు

తాళ్లపూడి: అన్ని గ్రామాలకూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యక్రమాలు విస్తరించేందుకు కృషి చేస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా కార్యవాహ్ పి.నారాయణరెడ్డి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శత జయంత్యుత్సవాల సందర్భంగా ఆ సంస్థ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య శిక్షక్ కార్యవాహ్ జిల్లా నివాసితవర్గం నిర్వహించారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని 32 మండలాల నుంచి వచ్చిన స్వయం సేవకులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ, కర్ర సాము ప్రదర్శన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఉభయ గోదావరి జిల్లాల కార్యనిర్వాహ్ మాణిక్యాలరావు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా క్రియాశీలక స్వయం సేవకుల నిర్మాణం జరగాలన్నారు. దేశ ప్రజలందరూ సమానమే అనే భావం కలిగేలా సంఘ విస్తరణ, శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్‌లు బొర్రా శ్రీరామచంద్రమూర్తి, అడ్డా శ్రీరామ్ మోహన్, బౌదిక్ ప్రముఖ్ జగదీష్ వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోపాలపురం తహసీల్దార్‌గా ప్రదీప్‌కుమార్



గోపాలపురం: తహసీల్దార్‌గా బి.ప్రదీప్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ డి వనజాక్షి కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్‌కుమార్ కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రదీప్‌కుమార్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కల్యాణికి మాజీ మంత్రి వనిత పరామర్శ



తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో కల్యాణిని పరామర్శించిన మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులు తాళలేక మండలంలోని అచ్చన్నపాలెం 31వ నంబర్ అంగన్‌వాడీ కేంద్ర ఆయా ఉన్నమట్ల కల్యాణి ఆదివారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్యాణిని హోం శాఖ మాజీ మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు కారుమంచి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, మాజీ సర్పంచ్ బొప్పన సత్తిరాజు, కఠారి రాజ్‌కుమార్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకర్ల గంగాధర్, కసుకుర్తి రామకృష్ణ తదితరులు పరామర్శించారు. అంతకు ముందు ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకట లక్ష్మి, కృష్ణవేణి ఆసుపత్రికి వెళ్లారు.

ముంచెత్తిన వరద

- గోదావరి ముంపులో గోష్పాద క్షేత్రం
- క్రమంగా పెరుగుతున్న ప్రవాహం
- లంక పంటలను ముంచెత్తిన నీరు
- మద్దూరిలంకలో నది ఉధృతిని పరిశీలించిన సబ్ కలెక్టర్



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఆలయాలను ముంచెత్తిన గోదావరి వరద

కొవ్వూరు: గోదావరి మహోగ్ర రూపం దాలుస్తోంది. ఈ సీజన్‌లో రెండోసారి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి నది ప్రవహిస్తోంది. స్థానిక గోష్పాద క్షేత్రాన్ని శనివారం రాత్రి వరద ముంచెత్తింది. ఇక్కడి ఆలయాలన్నీ ముంపులోనే ఉన్నాయి. సుమారు రెండు అడుగులకు పైగా వరద నీరు ప్రవహిస్తోంది. నదిలో ప్రవాహ ఉధృతి అధికంగా ఉండడంతో అధికారులు గోష్పాద క్షేత్రంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. ప్రజలను నదిలో స్నానాలకు దిగకుండా పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బంది క్షేత్రం వద్ద కాపలా కాస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి నీటిమట్టం 15.70 అడుగులకు చేరింది. వరద ఉధృతి కొంతమేర పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు కొవ్వూరు డివిజన్‌లోని తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, నిడదవోలు మండలాల లంకల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలు మళ్లీ ముంపు బారిన పడ్డాయి. గతంలో నాలుగైదు రోజుల పాటు ముంపులో ఉండి, ప్రస్తుతం పంటలు తేరుకుంటున్న తరుణంలో మరోసారి వరద పోటెత్తడంతో లంక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దూరిలంకలో సబ్ కలెక్టర్ పర్యటన

గోదావరి వరద కోతకు గురవుతున్న మద్దూరిలంక గ్రామంలోని లంక ప్రాంతాన్ని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం పరిశీలించారు. ఇప్పటికే వరద మద్దూరిలంకను చుట్టుముట్టి ప్రవహిస్తోంది. గ్రామంలోకి వరద నీరు ప్రవేశించకుండా ఇసుక బస్తాలు తాత్కాలికంగా అడ్డుగా వేశారు. అవసరమైతే ఇక్కడి పల్లెపాలెంలో ఉంటున్న 18 మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సబ్ కలెక్టర్ సూచించారు. గోదావరి ఎగువ ప్రాంతంలో వరద పరిస్థితి గురించి సబ్ కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగించాలని సూచించారు. ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కొవ్వూరు మండలం మద్దూరిలంకలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



వేగేశ్వరపురం లంక భూముల్లో ముంపులో చిక్కుకున్న బెండ తోట. ఒడ్డుకు చేరిన పడవలు

మునుగుతున్న లంకలు

తాళ్లపూడి: గోదావరికి వరద మళ్లీ పెరుగుతోంది. ఆదివారం మండలంలోని లంక భూముల్లోకి మళ్లీ నీరు చేరింది. తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద, ప్రక్కిలంక ర్యాంపు వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నదిలో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే లంక భూముల్లోని పల్లపు ప్రాంతాల్లో సాగవుతున్న పంటలు ముంపు బారిన పడ్డాయి. వేగేశ్వరపురం మేరీమాత ఆలయం మెట్ల వద్దకు వరద నీరు చేరింది. తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురంలోని గోదావరి లంకల్లో సాగు చేస్తున్న బెండ, దొండపాదులు, వంగ,అరటి, కంద, ఆకు కూరలు ముంపులో చిక్కుకున్నాయి. పంటలకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. గోదావరిలో చేపల వేటకు వెళ్లే పడవలు ఒడ్డుకు చేరాయి. ప్రజలెవరూ నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

లంక పంటలు కకావికలం



ముక్కామల వద్ద వరదలో మునిగిన పంటలు



మల్లేశ్వరం వద్ద పూర్తిగా మునిగిన దొండ పందిరి

పెరవలి: మూడు రోజులుగా తగ్గుతూ వచ్చిన గోదావరి ఆదివారం మహోగ్ర రూపం దాల్చింది. దాంతో మండలంలోని వివిధ గ్రామాల లంక భూముల్లో సాగవుతున్న వేలాది ఎకరాల్లోని వివిధ రకాల పంటల నీట మునిగాయి. రెండోసారి నీట మునిగిన పంటలు అక్కరకు రావని రైతులు వాపోతున్నారు. వాణిజ్య పంటలైన కంద, పసుపు, తమలపాకులు, బొప్పాయి, అరటి, మొక్కజొన్న తోటలు దెబ్బతింటాయని చెబుతున్నారు. వాటితో పాటు కూరగాయల పంటలు, పూలతోటలు పనికిరావని సాగుదారులు పేర్కొంటున్నారు. మండలంలోని పది నదీ తీర గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు.

రూ.కోట్లలో నష్టం

వాణిజ్య పంటల సాగుకు ఎకరానికి రూ.1.20 లక్షల వరకూ పెట్టుబడి పెట్టవలసి ఉందని ఏ విధంగా చూసినా నష్టం రూ.30 కోట్లు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎగువన మరింత నీరు ఉందని దీని వలన గోదావరి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పెరవలి మండలంలోని గోదావరి లంకల్లో సాగవుతున్న పంటలన్నీ గోదావరి వరదకు మునిగి పోయాయని సిబ్బంది ద్వారా తమకు సమాచారం అందిందని కొవ్వూరు ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాసరావు ఆదివారం ‘సాక్షి’కి తెలిపారు. సోమవారం సాయంత్రానికి పంటనష్టం ప్రాథమిక అంచనాలు వస్తాయని తెలిపారు. వరద ముంపు పూర్తిగా తొలగితేనే పూర్తి నష్టం వివరాలు తెలుస్తాయని, అందుకు మరికొన్ని రోజుల సమయం పడుతుందని తెలిపారు.

ముంపు నివారణకు మూడు దశల్లో పనులు

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- మంత్రులు అనిత, దుర్గేష్‌లతో కలసి ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో పర్యటన



కంసాలిపాలెంలో వరి దుబ్బును పరిశీలిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, దుర్గేష్

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో ఎర్ర కాలువ వరద ముంపు ప్రాంతాలను మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్ ఆదివారం పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎర్ర జలాశయం ప్రభావంతో 20 మండలాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ముంపు శాశ్వత నివారణకు మూడు దశల్లో పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. తొలి దశలో ఏటిగట్లకు పడిన గండ్లు పూడ్చడం, రెండో దశలో స్లూయిజ్ తలుపులకు మరమ్మతులు, మూడో దశలో ఇరిగేషన్ శాఖ సమన్వయంతో ఆధునీకరణ పనులు చేస్తామన్నారు. ఎర్రకాలువ ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులకు కలెక్టర్ పి.ప్రశాంతి మ్యాప్ ద్వారా వివరించారు. వరదల్లో నీటి మునిగిన పొలాలకు సంబంధించి ఫొటోలను మంత్రులు తిలకించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సర్పంచులు యర్రా రామకృష్ణ, కొండపల్లి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఉండ్రాజవరం: ఎర్ర కాలువ ముంపుతో పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఎర్ర కాలువ వరద ఉధృతికి మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్దారి గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను ఆదివారం అచ్చెన్నాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. బాధిత రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎర్ర కాలువ పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కలెక్టర్ పి.ప్రశాంతి మంత్రులకు వివరించారు.

ఇప్పటికీ వీడని ఎర్ర కాలువ ముంపు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపు నీరు ఇంకా పొలాలను వీడలేదు. వారం రోజులుగా వరి పొలాలు నీటిలోనే ఉండడంతో దుబ్బులు కుళ్లిపోయాయి. మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం గ్రామాల వరి పొలాల్లో ఆదివారం కూడా వరద తగ్గక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కె.అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్‌లు పొలాల పరిశీలించారు. అయితే జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లిస్తామని మంత్రులు ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వక పోవడంపై రైతుల్లో నిరాశ నెలకొంది. ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



నిడదవోలు మండలం కంసాలిపాలెంలో పంట పొలాల్లో ఎర్ర కాలువ వరదనీరు



పంట దెబ్బతిన్న పొలంలో మళ్లీ వరినాట్లు వేస్తున్న కౌలు రైతులు

కుళ్లిన పొలంలో మళ్లీ వరినాట్లు

నిడదవోలు: ఎర్ర కాలువ వరదకు కంసాలిపాలెంలోని వేలాది ఎకరాల పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద తగ్గడంతో ఇద్దరు కౌలు రైతులు ఆదివారం తమ పొలం వద్దకు వచ్చారు. కుళ్లిన పంటను చూసి కంటతడి పెట్టుకున్నారు. ఇక్కడ ఎక్కువగా కౌలు రైతులే వరి సాగు చేస్తున్నారు. గతంలో నాట్లేయగా మిగిలిన వరినారును తీసుకు వచ్చి దెబ్బతిన్న పొలంలో గట్టు వద్ద కొద్దిపాటి జాగాలో మళ్లీ వరి నాట్లు వేశారు. ఈ దృశ్యం చూపరులను కంట తడి పెట్టించింది. పంటకు ఇంత పంటనష్టం వాటిల్లినా ఆశ చావని రైతులు మళ్లీ వరినాట్లు వేశారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

నల్లజర్ల: తుపాను, అధిక వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల పల్లపు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగిన 40 కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందజేసింది. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో వంట నూనె, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయల చొప్పున తహసీల్దారు కృష్ణారావు శనివారం రాత్రి ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలకు అందజేశారు. అంతేకాకుండా ఒక్కో ఇంటికి రూ.3 వేల చొప్పున పరిహారంగా అందించారు.



నబీపేటలో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

64 కుటుంబాలకు ప్రభుత్వ సహాయం

దేవరపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గృహాలు దెబ్బతిన్న కుటుంబాలకు సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వరదల వల్ల గృహాలు దెబ్బతిన్న కుటుంబాలపై రెవెన్యూ శాఖ అధికారులు లెక్కలు తేల్చి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీని ప్రకారం గోపాలపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 64 కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. దేవరపల్లి మండలంలో 11, నల్లజర్ల మండలంలో 40, గోపాలపురం మండలం మండలంలో 13 కుటుంబాలకు ఈ సహాయం అందుతుంది. ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, కిలో వంటనూనె చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. దేవరపల్లి మండలంలోని బాధితులకు ఆదివారం నిత్యావసరాలు అందజేసినట్టు తహసీల్దార్ వైవీఎస్ ఆచారి తెలిపారు.

కొవ్వూరులో తాగునీరు కలుషితం



కొవ్వూరు మున్సిపాలిటీలో కుళాయి నుంచి సరఫరా చేస్తున్న రంగుమారిన తాగునీరు

కొవ్వూరు: స్థానిక మెరక వీధిలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న తాగు నీరు రంగు మారి మురికిగా ఉంటోంది. ఒక వైపు అధికారులు గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను దగ్గరుండి మరీ శుభ్రం చేయిస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో మాత్రం ఆ జాగ్రత్త చర్యలు కనిపించడం లేదు. పట్టణ పేదలందరూ ఈ నీటిని తాగుతున్నారు. ఆర్థిక పరిస్థితి కాస్త బాగున్నవారంతా మినరల్ వాటర్ క్యాన్లు తెచ్చుకుని తాగుతున్నారు. పేదలంతా మునిసిపాలిటీ సరఫరా చేసే కుళాయి నీళ్లనే తాగుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి తాగునీటి కలుషితంపై దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా తాగునీటి పైప్‌లైన్లను చెట్ల వేర్లు ఛేదించుకుంటూ వెళ్లినందున తాగునీరు కలుషితం అవుతోందన్నారు. ఈ సమస్య ఎక్కడెక్కడ ఉందో గుర్తిస్తున్నామని చెప్పారు. పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి, నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిలో క్లోరినేషన్ కూడా అధికంగా చేయిస్తున్నామని చెప్పారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా మారుమూల గ్రామాల పేదలకు సేవా కార్యక్రమాలు అమలు చేస్తామని ఆ సంస్థ మండలశాఖ అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి అన్నారు. మానవత సంస్థ మండల శాఖ సమీక్ష సమావేశాన్ని ఆదివారం వాదాలకుంట పంచాయతీ పరిధిలోని వెదుళ్లకుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాంబాబు, గెడా జోగేంద్రప్రసాద్, కె. కీర్తికుమార్, జొన్నలగడ్డ ప్రదాస్, జె.శ్రీనివాస్, యంత్రపగడ మంగారావు, జేష్ట సతీష్ పాల్గొన్నారు.

ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త వహించండి

కొవ్వూరు: గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది దిగువ గ్రామాల ప్రజలకు ప్రాణనష్టం లేకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. రోడ్లు కంరైలు వంతెన దెబ్బతినకుండా ప్రభుత్వ యంత్రాంగం , ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన కోరారు. వరద బాధితులకు తగిన పునరావాసం కల్పించాలని, నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్న రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

వేగేశ్వరపురంలో సాయి సత్సంగ్



వేగేశ్వరపురంలో నిర్వహిస్తున్న సాయి సత్సంగ్

తాళ్లపూడి: సాయి సచ్చరితను అధ్యయనం చేసి అర్థం చేసుకోగలిగితే ఆ వ్యక్తి జీవన శైలిలో ఎంతో మార్పు వస్తుందని శ్రీశైలానికి చెందిన సాయిదాసు అన్నారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సత్సంగ్ నిర్వహించారు. స్థానిక షిర్డీసాయి ఆలయ కమిటీ, హైదరాబాద్‌కు చెందిన శ్రీ షిర్డీ సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీశైలానికి చెందిన సాయిదాసు, నెల్లూరుకు చెందిన కర్లపూడి కృష్ణలు తమ ప్రసంగాల్లో బాబా పూజా విధానం, బాబా హారతుల విశిష్టత గురించి భక్తులకు వివరించారు. సాయితత్వంలో కులమతాలు లేవని, భూమిపై జీవించే అందరూ ఒకటేనని వారన్నారు. దత్తాత్రేయుని అంశంలో ఒక రైన షిర్డీ సాయినాథుని తత్వాన్ని అర్థం చేసుకోవాలని, ప్రతి వ్యక్తీ దైవ చింతన అలవరచుకోవాలని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు, షిర్డీ సాయి సేవాదళ్ స్థాపకులు కాళ్ల రత్నాజీ, గోవూరు రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, కురసాల అబ్బులు, ఆలయ అర్చకుడు పెరవలి సత్య ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

చాగల్లు: స్థానిక వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన చాగల్లు ఎస్సై పి.నాగరాజు మాట్లాడుతూ క్రైమ్, సైబర్ క్రైమ్ జరుగుతున్న విధానాల గురించి, మహిళలపై జరుగుతున్న దాడుల గురించి వివరించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులు ఏ విధంగా న్యాయం పొందవచ్చో వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. దురలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గాన వెళ్లాలని సూచించారు. ప్రతి విద్యార్థీ తమ తల్లిదండ్రులకు, గురువులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

కొవ్వూరు: విద్యార్థులు మత్తు పదార్థాలు,డ్రగ్స్, ఇతర దురల వాట్లకు దూరంగా ఉండాలని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాల త్రిపుర సుందరీదేవి అన్నారు. స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించు కుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్య ద్వారా ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల న్నారు. ప్యానల్ న్యాయవాదులు ఎస్‌వీ మున్నా,వై.ప్రకాశరావు,ఆర్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



పాఠశాలలో కలాంకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. హెచ్ఎం డి.దుర్గారావు, విద్యార్థులు కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. మిస్సైల్ మేన్‌గా గుర్తింపు పొంది, 11వ రాష్ట్రపతిగా పని చేశారని హెచ్ఎం గుర్తుచేశారు.

అవుట్ సోర్సింగ్ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివ



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన పోలిశెట్టి శివను సత్కరిస్తున్న సంఘ నాయకులు

కొవ్వూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ కమిటీల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొవ్వూరు ఏఎంసీలో పని చేస్తున్న పోలిశెట్టి శివ ఎన్నికైనట్టు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం తెలిపారు. సంఘ రాష్ట్ర సమావేశాన్ని ఆదివారం ప్రకాశం జిల్లా దర్శి ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు శివను సత్కరించారు.

గోష్పాద క్షేత్రంలో శత చండీయాగం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో ఆదివారం శత చండీయాగం నిర్వహించారు. రుత్విక్కుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ యాగం కొనసాగింది. స్థానిక భక్తులు ఈ యాగాన్ని దర్శించుకుని,యాగరక్ష, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.